క్లుప్తంగా

జెడ్పీ చైర్‌పర్సన్ పరామర్శ



పరామర్శలో జెడ్పీ చైర్‌పర్సన్ విజయ తదితరులు

కంచిలి: గొల్లకంచిలి గ్రామానికి చెందిన డొక్కరి అప్పయ్య అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఇచ్ఛాపురం నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ మృతిని కుటుంబాన్ని సోమవారం పరామర్శించారు. ఆమెతోపాటు స్థానిక ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, నాయకులు లద్దు కేశవపాత్రో, ఎం.ఎస్.పల్లి, బొగాబెణి సర్పంచ్లు కొణపల సురేష్, గణప సింహాచలం, ఎంపీటీసీ సభ్యుడు బొండాడ వైకుంఠరావు, స్థానిక నాయకులు డొక్కర పురుషోత్తం, దాలయ్య, మోహనరావు, భోగయ్య ఉన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు



కొర్లాం జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన బోర్డు

సోంపేట: మద్యం తాగి వాహనాలు నడుపరాదని బారువ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ హరిబాబు నాయుడు అన్నారు. కొర్లాం జాతీయ రహదారి సమీపంలో మూడు రహదారుల జంక్షన్ వద్ద సేఫ్టీ కాసన్ బోర్లను సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది వాహనాలు నెమ్మదిగా నడపాలని, హెల్మెట్ విధిగా ధరించాలని ప్రజలకు అవగాహనకల్పించారు.

కార్మికులు సమయపాలన పాటించాలి



శానిటేషన్ పనులు పరిశీలిస్తున్న కమిషనర్ రామారావు

కాశీబుగ్గ: పారిశుద్ధ్య కార్మికులు సమయపాలన పాటించాలని పలాస–కాశీబుగ్గ మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు అన్నారు. సోమవారం వేకువజాము నుంచి పలు వార్డుల్లో పర్యటించి పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. 12, 1 వార్డులో ప్రత్యేకంగా తిరిగి అక్కడి సమస్యలు తెలుసుకున్నారు. చాకలచెరువు వద్ద దోబీఘాట్‌ను పరిశీలించి అధికంగా చెత్త ఉన్న చోట జేసీబీతో చెత్తను తొలగించారు. మూడో వార్డు పద్మనాభపురం కోనేరులో చెత్తను తొలగించి శుభ్రం చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సూపర్‌వైజర్‌లు ఉన్నారు.

పాఠశాలకు సౌండ్ సిస్టమ్ వితరణ

వజ్రపుకొత్తూరు రూరల్: డోకులపాడు గ్రామానికి చెందిన 'చైతన్యంతో ముందడుగు' సంస్థ వ్యవస్థాపకులు పుక్కళ్ల రాజేంద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సౌండ్ సిస్టమ్ నిమిత్తం రూ.10 వేలును సోమవారం ఉపాధ్యాయులకు అందజేశారు. పాఠశాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని అన్నారు.

పెసరపాడు రోడ్డు పరిశీలన



రోడ్డును పరిశీలిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ ఆరో వార్డు పెసరపాడు రోడ్డును ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు సోమవారం పరిశీలించారు. గ్రామం నుంచి పలు రోడ్లతో పాటు శ్మశానవాటికకు రోడ్డు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికుల ద్వారా బాబూరావు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉన్నత అధికారులతో మాట్లాడి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. గ్రామపెద్ద సంపతిరావు ధనుంజయరావు, శాశుమాను చంద్రమౌళి ఉన్నారు.

భవితను తీర్చిదిద్దుతున్న కేంద్రాలు!

- దివ్యాంగ చిన్నారులకు అండగా నిలుస్తున్న వైనం
- మానసికోల్లాసంతో పాటు సహిత విద్య



ప్రత్యేక అవసరాల చిన్నారులకు ఫిజియోథెరపి చేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం: దివ్యాంగ చిన్నారులకు భవిత కేంద్రాలు ఆసరాగా నిలుస్తున్నాయి. అవయవాల లోపం, బుద్ధిమాద్యం వంటి మానసిక, శారీరక వైకల్యంగల చిన్నారులలో మనోధైర్యం నింపి వారిలో పురోగాభివృద్ధికి భవిత కేంద్రం దోహదపడుతుంది. సాధారణంగా ప్రత్యేక అవసరాలు గల చిన్నారులు ఇంటికే పరిమితమయ్యేవారు. దీంతో వీరి తల్లిదండ్రులకు వారి పట్ల ప్రత్యేక శ్రద్ధతో చూసుకోవాల్సి వచ్చేది. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించే కార్యక్రమాలు భవిత కేంద్రాల్లో నిర్వహిస్తున్నారు. దీంతో ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల్లో నూతన ఉత్సాహం నింపి వారి మనోవికాసానికి బాటలేసే విద్ధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. దీంతో గతంలో వారివ్యక్తిగత పనులను కూడా చేసుకోలేని పిల్లలు సైతం వారి అవసరాలను వారు స్వంతంగా చేసుకునే స్థితికి అభివృద్ధి చెందడంతో వారి తల్లిదండ్రులు భవిత కేంద్రాల నిర్వాహణపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు అందజేసే సహితవిద్యను విద్యాశాఖలో భాగమైన సమగ్రశిక్షా పథకం ద్వారా భవిత కేంద్రాలను నిర్వహిస్తున్నారు. భవిత కేంద్రాల్లో ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం 3.30 గంటల వరకు సంరక్షించి వారికి 21 రకాల సేవలతో కూడిన సహిత విద్యను అందిస్తున్నారు. వీరికి మధ్యాహ్న భోజన పథకంతో పాటు మానసిక ఉల్లాసానికి అవసరమైన ఆటపాటలతో ఉత్తేజపరిచి వారిని ప్రోత్సహిస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలో ముత్యాలమ్మపేట మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రం ద్వారా ఇచ్ఛాపురం పట్టణం, మండలం పరిధిలో గల ఇటువంటి ప్రత్యేక అవసరాల చిన్నారులను ప్రోత్సహించి వారిలో నూతన ఉత్సాహాన్ని నింపుతున్నారు. ఈ కేంద్రంలో ప్రతీ బుధవారం ప్రత్యేక ఫిజియోథెరపీ శిక్షణ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణ కేంద్రం ద్వారా ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు అందించాల్సిన ఫిజియోథెరపీ గురించి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో వారిలో శారీర వైకల్యాన్ని తగ్గించేందుకు తేలికపాటి యోగాసనాలు, ఎక్సర్‌సైజ్‌ల గురించి వివరిస్తున్నారు. అంతేకాక వారి తల్లిదండ్రులకు సూచనలు చేస్తున్నారు. వీటితో పాటు మంచానికే పరిమితమైన వారిని వారంలో రెండు రోజులు గృహ సందర్శనం చేసి సహిత ఉపాధ్యాయుల ద్వారా వారికి అవసరమైన ఫిజియోథెరపీ సేవలను అందిస్తున్నారు.

గత ప్రభుత్వ హయాంలో..

గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం భవిత కేంద్రాలకు అవసరమైన ప్రత్యేక పరికరాలను అందజేయడంతో పాటు వినికిడి, ఇతర శరీర అవయవ లోపాలు కలిగిన చిన్నారులకు గుర్తించి సమగ్రశిక్షా ద్వారా వీల్‌చైర్లు, ట్రైసైకిళ్లను, హియరింగ్ మెషిన్లు వంటి వివిధ రకాల పరికరాలను అందజేసింది. కూటమి ప్రభుత్వం కూడా దివ్యాంగ చిన్నారులను గుర్తించి వారికి అవసరమయ్యే పరికరాలను అందజేయాలని వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

మాదృష్టికి తీసుకొస్తున్నాడు



మా బాబు దనపాన శంకర్ బుద్ధిమాద్యంతో జన్మించాడు. చిన్నగా ఉన్నపుడు ఏవిషయం కూడా మాకు చెప్పేవాడు కాదు. బాబు పరిస్థితి చూసి చాలా ఆందోళనగా ఉండేది. భవిత కేంద్రంలో చేర్పించడం.. నిత్యం ఫిజియోథెరపిస్టు సూచనల మేరకు అవసరమైన శిక్షణను అందజేస్తున్నాము. దీంతో వాడిలో మార్పు కనపడుతుంది.

– దనపాన భారతి, పురుషోత్తపురం, ఇచ్ఛాపురం

తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధచూపాలి



ప్రత్యేక అవసరాల గల దివ్యాంగ చిన్నారులపై వారి తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధచూపాలి. వారిని క్రమం తప్పకుండా భవిత కేంద్రానికి పంపించినప్పుడే వారిలో మానసిక ఉత్సాహం కలిగి పురోభివృద్ధి సాధించగలుగుతారు. రోజూ వారికి అవసరమైన శారీరక శిక్షణను కూడా మా సూచనల మేరకుఅందజేయాలి. అప్పుడే వారిలో మార్పుని తీసుకురాగలము.

-బి.అమూల్య, ఫిజియోథెరపిస్టు

గతం కంటే మెరుగ్గా ఉంది



మాబాబు పైల సూర్య పుట్టుకతోనే పాక్షిక పక్షవాతం కారంగా బలహీనంగా ఉండేవాడు. వాడికి ప్రతీపనిలో ఎవరో ఒకరు తోడు ఉండాల్సి ఉండేది. ఏ విషయం కూడా మాకు చెప్పలేక ఇబ్బంది పడేవాడు. భవిత కేంద్రానికి తీసుకురావడంతో కొన్ని విషయాలను మాకు తెలియజేసేందుకు ప్రయత్నిస్తుండడం కాస్త ఊరటగా ఉంది.

–పైల శంకర్, ఇచ్ఛాపురం

నేడు మండల సర్వసభ్య సమావేశం

వజ్రపుకొత్తూరు: మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఎస్.రమేష్‌నాయుడు సోమవారం తెలిపారు. ఉదయం పది గంటలకు ఎంపీపీ ఉప్పరపల్లి నీలవేణి అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

ఉత్సాహంగా క్రికెట్ టోర్నమెంట్

కంచిలి: మండల కేంద్రం కంచిలిలో శ్రీ కంచమ్మతల్లి క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహంగా సాగుతోంది. ఇందులో భాగంగా సోమవారం మూడు మ్యాచ్‌లు నిర్వహించారు. మొదటి మ్యాచ్‌లో జాడుపూడి–గొల్లకంచిలి జట్ల మధ్య జరగ్గా.. జాడుపూడి జట్టు నిర్ణీత ఎనిమిది ఓవర్లలో 54 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. తర్వాత బ్యాటింగ్ చేసిన గొల్లకంచిలి జట్టు 5.5 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 57 పరుగులు చేసి గెలుపొందింది. మధ్యాహ్నం ఆదిబాబ్ ఎస్ ఎక్స్‌ఎల్– రాయల్ ఎక్స్‌ఎల్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆదిబాబ్ ఎస్ ఎక్స్‌ఎల్ జట్టు తొమ్మిది వికెట్ల నష్టానికి 67 పరుగులు చేయగా, రాయల్ ఎక్స్‌ఎల్ జట్టు ఏడు వికెట్ల నష్టానికి 80 పరుగులు చేసి 13 పరుగుల తేడాతో గెలుపొందింది. సాయంత్రం రాయల్ ఎక్స్‌ఎల్– కవిటి జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. ఇందులో రాయల్ ఎక్స్‌ఎల్ జట్టు ఆరు వికెట్ల నష్టానికి 90 పరుగులు చేయగా.. కవిటి జట్టు నాలుగు వికెట్ల నష్టానికి 86 పరుగులు చేసి ఓటమి చెందింది.

సారాతో వ్యక్తి అరెస్టు

పలాస: పెదంచల పంచాయతీ జగన్నాథపురం గ్రామానికి చెందిన ఎ.బాలక్రిష్ణను సారాతో కాశీబుగ్గ ఎక్సైజ్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. అతను వద్ద నుంచి పది లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మురళీధరరావు తెలిపారు. మండలంలో విస్తృతంగా దాడులు చేశామని.. అందులో భాగంగానే అతన్ని అరెస్టు చేశామన్నారు. గ్రామాల్లో నాటు సారా అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి

- ఎమ్మెల్సీ రామారావు



వైద్య సేవలపై వైద్యాధికారి దేవేంద్రరెడ్డిని అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్సీ రామారావు

ఇచ్ఛాపురం: ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండి వారికి సకాలంలో వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. ఇచ్ఛాపురం పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిని మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మితో కలిసి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి పి.దేవేంద్రరెడ్డితో మాట్లాడి ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యుల గురించి అడిగి తెలుసుకున్నారు. కాల్‌డ్యూటీలో ఉన్న వైద్యులు సకాలంలో స్పందించడం లేదని తనదృష్టికి వచ్చిందన్నారు. ఈవిధంగా జరిగితే అత్యవసర పరస్థితిలో ప్రజలు ప్రాణాలను కోల్పోయే పరిస్థితులు ఏర్పడతాయని.. ఇటువంటివి పునరావృతం కాకుండా ఉండాలని వైద్యాధికారికి సూచించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. రెండు వైద్యుల పోస్టులు భర్తీకావలసి ఉందన్నారు. అనంతరం ఆదివారం సంతపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదస్థలాన్ని ఎమ్మెల్సీ పరిశీలించారు. రోడ్డు పక్కగా జంగిల్ క్లియరెన్స్ చేయాలని ఆర్‌అండ్‌బీ సిబ్బందికి సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు ప్రకాశరావుపట్నాయక్, పి.రాజశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్లు సుగ్గు ప్రేమ్‌కుమార్, బచ్చు జగన్ వైఎస్సార్‌సీపీ నాయకులు పిలక సంతు, ఈశ్వర్‌రెడ్డి, పిలక విజయ్‌భాస్కర్‌రెడ్డి, బాగ మోహన్‌రావు, ప్రత్తి అన్వేష్, సాలిన గాంధీ ఉన్నారు.

రహదారి సౌకర్యం కల్పించాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పలాస: పలాస మండలం కొతారింగ్ తాళభద్ర గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు వంకల మాధవరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు గ్రీవెన్స్ సెల్‌లో సోమవారం వినతిపత్రం అందజేశారు. తర్లాకోట పంచాయతీ పరిధిలోని కొతారింగ్ తాళభద్ర, గట్టూరు, బాపనూరు, బాలాజీపూరు, పుత్రియ తదితర ఆదివాసీ గ్రామాలకు నేటికి సరైన రహదారి సదుపాయం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే రహదారి సౌకర్యం ఏర్పాటు చేయాలని విన్నవించారు. అతనితో పాటు ఆ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు జుత్తు వీరాస్వామి, సవర భవన్, ఇజ్రాయిల్, పాపారావు, సుబ్బారావు, శాంతి, లక్కి ఉన్నారు.

క్రీడాకారులకు ఏకరూప దుస్తులు పంపిణీ



దుస్తులు వితరణ చేస్తున్న శ్రీధర్

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని క్రికెట్ క్రీడాకారులకు పలాస పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు దువ్వాడ శ్రీధర్ ఏక రూప దుస్తులను సోమవారం పంపిణీ చేశారు. జంట పట్టణాలకు చెందిన మూడు క్రికెట్ జట్లను ప్రోత్సహించడంలో భాగంగా పలాస శివాజీనగర్ షిర్డీసాయి బాబా ఆలయ ప్రాంగణానికి క్రీడాకారులను పిలిపించి దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు, యువత పాల్గొన్నారు.

జిల్లా కబడ్డీ జట్ల ఎంపికల రేపు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సీనియర్స్ పురుషులు, మహిళల కబడ్డీ జట్ల ఎంపికలు ఈనెల 22వ తేదీన జరగనున్నాయని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు యార్లగడ్డ వెంకన్న చౌదరి, కార్యదర్శి అకేన చిరంజీవిరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా కేంద్రంలోని కోడిరామ్మూర్తి స్టేడియం ప్రాంగణంలో బుధవారం ఉదయం 9 గంటల నుంచి ఈ ఎంపికల ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులకు ఎలాంటి వయో నిబంధనలు లేవని పురుషులు 85 కేజీలు, మహిళలు 75 కేజీలలోపు బరువు ఉండాలని స్పష్టం చేశారు. ఇక్కడ ఎంపికైన జిల్లా జట్లను జనవరి 25 నుంచి 27 వరకు విశాఖపట్నంలో జరిగే 71వ ఏపీ రాష్ట్రస్థాయి (అంతర్‌జిల్లాల) సీనియర్స్ కబడ్డీ ఛాంపియన్‌షిప్ పోటీలకు పంపిస్తామని వెల్లడించారు. రాష్ట్రపోటీల్లో రాణించే క్రీడాకారులను ఫిబ్రవరి 20 నుంచి 23 వరకు ఒడిశాలో జరిగే జాతీయ సీనియర్స్ కబడ్డీ పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 77027 42399, 99639 58848, 89859 50912 నంబర్లను సంప్రదించాలన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

- అధికారులకు వైఎస్సార్‌సీపీ నాయకుల వినతి



టెక్కలి ఆర్డీవో కార్యాలయ ఏవోకు ఫిర్యాదు చేస్తున్న పేరాడ తిలక్ తదితరులు

టెక్కలి: నియోజకవర్గ పరిధిలోని కోటబొమ్మాళి మేజర్ పంచాయతీలో సర్వే నంబరు 91–2లో ప్రభుత్వానికి చెందిన చెరువు గర్భంలో మండల తెలుగుదేశం నాయకులు చేస్తున్న అక్రమ నిర్మాణాలను తక్షణమే ఆపాలని, అలాగే అక్రమంగా ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేస్తున్న వారిపై చర్యలు తక్షణమే తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్‌తో పాటు జిల్లా, మండల నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ ఫిర్యాదుల విభాగంలో కోటబొమ్మాళి సర్పంచ్ కాళ్ల సంజీవరావుతో పాటు నాయకులంతా ఆర్డీవో కార్యాలయం పరిపాలనా అధికారి రషీద్ అహమ్మద్‌కు ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా ఇటీవల 'సాక్షి'లో ప్రచురితమైన మంత్రిగారి తాలూకా... దర్జాగా చెరువు కబ్జా పేరున కోటబొమ్మాళిలో టీడీపీ నాయకుని బరితెగింపు కథనాన్ని అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం తిలక్ మాట్లాడుతూ.. గతంలో కూడా చెరువు గర్భాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేయాలని టీడీపీ నాయకుడు ప్రయత్నించగా అప్పట్లో వైఎస్సార్‌సీపీ నాయకులు జిల్లా అధికారులు దృష్టికి తీసుకువెళ్లడంతో రెవెన్యూ అధికారులు కోర్టును ఆశ్రయించారని గుర్తు చేశారు. ప్రస్తుతం స్థలానికి సంబంధించిన కేసు కోర్టులో పెండింగ్‌లో ఉందని వివరించారు. మరలా ఇప్పుడు దర్జాగా చెరువు గర్భాన్ని ఆక్రమిస్తూ నిర్మాణాలు చేస్తున్నారని, దీనిపై అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించి కట్టడి చర్యలు తీసుకోవాలని తిలక్ కోరారు. అధికారులను కలిసిన వారిలో అన్నెపు రామారావు, సంపతిరావు హేమసుందరరావు, పేరాడ వెంకటరావు, నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, కురమాన బాలక్రిష్ణారావు, అక్కురాడ లోకనాథం, రాజేష్ ఉన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం

జి.సిగడాం: గ్రామాలకు మౌలిక సదుపాయాల కల్పనే ప్రభుత్వ లక్ష్యమని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. మండలంలోని సంతవురిటి నుంచి విజయరాంపురం, సీతారాంపురం నుంచి సంతవురిటి, టీడీవలస నుంచి నక్కపేట గ్రామాలకు వెళ్లే రహదారులకు సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బుడారి లక్ష్మణరావు, వడిశ మహేశ్వరరావు, ధారబోయిన రెయిమ్మ, పలిశెట్టి సూర్యనారాయణ, మాజీ ఎంపీపీలు బాలబొమ్మ మహాలక్ష్మి, టంకాల లక్ష్మి, బాలబొమ్మ వెంకటేష్, వైస్ ఎంపీపీ తోలేటి వెంకటరావు, ఎంఎంఎస్ అధ్యక్షురాలు శిర్రా లక్ష్మి, నాయకులు కుమరావు రవికుమార్, పైల విష్ణుమూర్తి, డీఈఈ శ్రీరాములు పాల్గొన్నారు.

మూడు రోజుల పాటు అన్నప్రసాద వితరణ

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): రథసప్తమి పురస్కరించుకొని ఫిబ్రవరి 2, 3, 4 తేదీల్లో అరసవల్లిలో శ్రీసూర్యస్నేహ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ నిర్వహించనున్నట్లు అరసవల్లి ట్రస్ట్ సభ్యులు డబ్బీరు శ్రీనివాసరావు, అధ్యక్షుడు మల్లేష్ సోమవారం తెలిపారు. మూడు రోజుల పాటు సుమారు 15వేల మందికి అన్నప్రసాద వితరణ చేయనున్నామని పేర్కొన్నారు.

ఆధార్ సేవలు వినియోగించుకోవాలి

హిరమండలం: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు సంబంధించి అందజేస్తున్న ఆధార్ సేవలు వినియోగించుకోవాలని ఎంపీడీఓ ఆర్‌కాశీప్రసాద్ అన్నారు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మండలంలో రెండు మొబైల్ ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు 23 గ్రామ పంచాయతీల్లో మొబైల్ ఆధార్ శిబిరాలు నిర్వహిస్తామన్నారు.

పశు ఆరోగ్య శిబిరాలు ప్రారంభం



కాశీబుగ్గ: బాలిగాంలో పశువులకు వ్యాక్సిన్ వేస్తున్న సిబ్బంది

టెక్కలి: పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మండల పశు వైద్యాధికారి ఎం.పూర్ణచంద్రరావు కోరారు. భగవాన్‌పురం పంచాయతీలో పశువులకు నట్టల నివారణ మందులతో పాటు పశు ఆరోగ్య శిబిరాన్ని సోమవారం నిర్వహించి మాట్లాడారు. పశు ఆరోగ్య శిబిరాల విశిష్టతను వివరించారు. సర్పంచ్ పి.సుకన్యతో పాటు మెండ దమయంతి, పి.రాజారావు, ఎం.సింహాచలం, ఎం.రమణ, ఎన్.జయరాం, చిన్నమ్మి, వరలక్ష్మి, అనిల్‌కుమార్, ప్రసాద్‌రావు, యోగేంద్రరాజు పాల్గొన్నారు.



టెక్కలి: పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్న సిబ్బంది

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మండలం మవచాలపేట, పెద్దబమ్మిడి గ్రామాలలో పశుసంవర్ధక శాఖాధికారులు పశు ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ నెలాఖరు వరకు వైద్య శిబిరాలను కొనసాగిస్తామని పశుసంవర్ధక శాఖ సంచాలకులు డాక్టర్ ఎం.లోకనాథం తెలిపారు. రెండు గ్రామాల్లోని 42 పశువులు, 162 గొర్రెలు, 46 మేకలకు నట్టల నివారణ మందులను వేశామన్నారు. అలాగే 389 గొర్రెలకు అమ్మవారి టీకాలు, 124 కోళ్లకు కొక్కెర వ్యాధి నివారణ టీకాలు వేశామన్నారు. కార్యక్రమంలో పశువైద్యులు డాక్టర్ ఎల్.కిరణ్‌కుమార్, డాక్టర్ ఎం ప్రజ్ఞచైతన్య, పశుసంవర్ధక సహాయకులు బలరాం, పద్మ ఉన్నారు.



టెక్కలి రూరల్: పశుఆరోగ్య శిబిరంలో వైద్యులు

కాశీబుగ్గ: మందస మండలం బాలిగాం గ్రామంలో పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి పశువులకు వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపట్టారు. మండల పశు వైద్యాధికారి డాక్టర్ దువ్వాడ శ్రీకాంత్ మాట్లాడుతూ.. ఈనెల 30వ తేదీ వరకు ప్రతీ పంచాయతీలో పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం..



టెక్కలి మేజర్ పంచాయతీలో నిత్యం రద్దీగా ఉండే చిన్న బజారులోని విద్యుత్ స్తంభం అడుగు భాగం పూర్తిగా పాడై పోయి కూలిపోయేందుకు సిద్ధంగా ఉంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకువస్తుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఈ స్తంభానికి అధిక సంఖ్యలో విద్యుత్ కనెక్షన్‌లు ఉన్నాయి. రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో భయాందోళన కలిగిస్తున్న విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

–టెక్కలి

మూలకు చేరిన ట్రాక్టర్..



ఇచ్ఛాపురం మండలం మండపల్లి మేజర్ పంచాయతీలో సేకరించిన చెత్తను వేరేచోట డంప్ చేయడం కోసం ట్రాక్టర్‌ను కేటాయించారు. దీన్ని డిసెంబర్ పదో తేదీన స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్ మండలాభివృద్ధి కార్యాలయం ఆవరణలో అట్టహాసంగా ప్రారంభించారు. అయితే నెలరోజులు దాటినప్పటికీ ట్రాక్టర్ మాత్రం పంచాయతీ కేంద్రానికి చేరలేదు. ప్రస్తుతం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మూలకు చేరింది.

–ఇచ్ఛాపురం రూరల్

సంపద కేంద్రాన్ని మరుగుదొడ్డిగా మార్చేశారు..



చెత్త నుంచి సంపద సృష్టించి వాటి ద్వారా వచ్చే ఆదాయాన్ని పంచాయతీ అభివృద్ధికి వినియోగించాల్సిన చెత్తలో సంపద కేంద్రం మరుగుదొడ్డిగా మారింది. ఇచ్ఛాపురం మండలం లొద్దపుట్టి గ్రామంలో నిర్మించిన చెత్తలో సంపద కేంద్రంపై అధికారుల పర్యవేక్షణ లోపించింది. దీంతో స్థానికులు కొంతమంది మరుగుదొడ్డిగా వాడేస్తున్నారు. లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మించిన సంపద కేంద్రాల నిర్వహణపై అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

–ఇచ్ఛాపురం రూరల్